కర్మ్యాకథ

# 'దొంగని సేసిన్రు'

—యర్రమిల్లి విజయలక్ష్మి

'ఈ జలమలో ఇట్టాటి కోక్కట్టుగో గల్నా..' అనుకుంది యాదమ్మ అతని చేతిలో మిగిలి వున్న ఆఖరి చీర చూస్తూ.

పది నిమిషాల క్రితం అక్కడి కొచ్చాడా మనిషి పెద్ద జిప్ బాగ్ నిండా చీరలతో.

యాదమ్మ చూస్తుండగా కళ్ళ ముందే చిటికెలో ఎవరెవరో వచ్చి ఎగబడి కొనుక్కెళ్ళిపోయారన్నీ.

"ఏటి బుల్లా అట్టా సూత్తన్నావు.. కోక్కొనుక్కుంటావా?" అన్నాడతను యాదమ్మ వ్యవ్వారం చూసి.

"కో...కా...నేనా..." యాదమ్మ నీళ్ళు నమిలింది. ఆ చీర నిజంగా కొను క్కోవాలన్న కొండంత ఆశ ఆ కళ్ళలో మిలమిలలాడుతోంది. అంతా ఎగబడి ఎత్తుకెళ్ళారు. ఇదొక్కటి మిగిలిపోనాది. ఏటి సెప్పు ... కావాల్నా..." అతను రెట్టించాడు.

మెత్తమెత్తగా మడతలో ఇమడ కుండా జారి జారిపోతోంది. నెమలి కంఠం రంగు, బారెడు వెడల్పు,బంగారు పూలంచు. సానా కరీదుంటది అను కుంటూ అప్రయత్నంగా ముందుకు వచ్చి అపురూపంగా మునివేళ్ళతో తాకింది. ఆ మెత్తదనానికి యాదమ్మ మనసు పులకరించింది.

"ఎంతేటి?" అంది జంకుతూ. 'ఎంతైతే తనకేటి.. కొనగల్దా ఏవన్నా' అనుకుంటూ.

"ఎంతోనా.. వంద!"

"ఓలమ్మో! వంద రూపాయిలా?" యాదమ్మ గుండెల మీద చెయ్యేసుకుని గుడ్లు మిటకరించింది.

"లాటులో సవగ్గా వచ్చింది. అసలు అయిదొందలిచ్చినా రాదు" అన్నాడతను అదోలా నవ్వి.

'నిజమే.. కోక సూత్తంటేనే తెలు త్తాంది సానా కరీదుంటదని' యాదమ్మ కళ్ళలో ధగధగ మెరిసే ఆశ జారిపోయి నిరాశ సెగ కొట్టింది.

."వద్దులెయ్" అంటూ కదల బోయింది.


అతను పోనివ్వలేదు.

"పోనీ ఎంతగ్గావాలో సెప్పు. ఈ కోక నీ కెంత బాగుంటదో తెల్సా.. యాభై ఇయ్యి..ఇంద.."

"యాబయ్యే.. నాకాడ ఏడవి?" ప్రలోభాన్ని ప్రయత్నం మీద అరికట్టు కుంటూ అంది.

"సరేలే .. ఎంతో కొంతియ్యి.. ఆడకూతురివి ముచ్చటపడ్తన్నవు గంద!"

"ఎంతంటె అంత కిచ్చేత్తావేటి?" అతని మాటల్లోని నిజాయితీని శంకిస్తూ సంకోచంగా అంది. చూపులన్నీ కోక



మీదే.

"అడిగి సూ(డాదూ.. కోకేటి... నీలాటి ఆడపిల్ల అడగాలేగాని ఏటన్నా ఇచ్చేమ్మ.." సరసంగా అన్నాడు.

యాదమ్మ ఉక్రోషపడుతూ పులుకు పులుకు చూసింది.. మాట్లాడలేదు.

"బేరాలెందుగ్గానీ, పాతికిచ్చెయ్యి"

యాదమ్మ ఉలిక్కిపడింది 'అంత గొప్ప కోక పాతికా' మనసు ఎగిరిపడింది. తన దగ్గర లేదు కాని వుంటే ఎంతైనా ఇచ్చేసి కొనేసుకున్ను! అంత సక్కగుంది! తనకాడ పాతిగ్గూడా లేదు గందా.. సీ.. పాడు బతుకు' యాదమ్మ నిరాశగా వెనుతిరిగింది.

"ఎంతుందేటి నీ కాడ!"

యాదమ్మ సిగ్గుపడుతూ చెప్పింది "పన్నెం(డూపాలున్నాయి."

"సరే..ఇగో..కోక. పదిచ్చెయి" కోక చకచక కాగితం సంచిలో వుంచి యాదమ్మ చేతిలో పెట్టాడు.యాదమ్మ బిత్తరపోయింది. ఇంతింత కళ్ళతో చిత్రంగా చూసింది. 'నిజమే ...!"

"బేగియ్యి. నే పోవాల" హెచ్చరిం చాడు. యాదమ్మ పయిట కొంగు ముడి మునిపంట విప్పి పది రూపాయిల నోటు పది మడతలు పెట్టింది తీసి ఇచ్చింది. మరుక్షణం ఆ మనిషి మటుమాయ మయ్యాడు. యాదమ్మ విస్తుపోయింది. అట్టే చూస్తూండిపోయింది. జరిగింది కల కాదు. వాస్తవమని చేతిలో మిగిలిన కాగితం పొట్లం చెప్తోంది. లోపల మెత్తగా, మృదువుగా కదులుతూ చీర.

యాదమ్మ గుడిసెకు పరుగెత్తు కొచ్చింది. రాగానే తడిక మూసి చీరంతా మడతలు విప్పి తాకి తాకి చూసింది. పమిట కొంగు అలవోకగా భుజాల మీదేసుకుని గోడకు వ్రేలాడుతున్న అద్దం ముక్కలో చూసుకుంది. ఆనందంతో తడబడిపోయింది.

* * *

"...ఏటే యాదమ్మా! ఇసేసం పెళ్ళికూతుర్లా వచ్చావే పన్లోకి" మేస్త్రీ నవ్వుతూ పలకరించాడు. మేస్త్రీయే కాదు, యాదమ్మని చూసినవాళ్ళంతా అదే ప్రశ్న వేశారు. పొడుగాటి వాల్జెడ, నిండుగా కారబ్బంతి పూల చెండు, పది రూపాయిలకొన్న పట్టుకోక నయ్యా రంగా కట్టి స్పెషల్ గెటప్‌లో చీపురు, తట్టా పుచ్చుకుని పన్లోకి దిగింది యాదమ్మ. మిలమిల మెరిసిపోతున్న జరీ అంచులు కనపడేలా నడుంచుట్టూ కొంగు బిగించి, పొడవాటి చీపురు క్రర అలవోకగా పుచ్చుకుని ఉదయమే నగర పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభిం చింది. రోడ్ మీద వెళ్ళేవాళ్ళు, వచ్చే వాళ్ళూ అందరూ తనని చూడడమే! అందరి కళ్ళూ తన మీదే..

"ఈ కోక నీ కెంచక్కగుందో ... లచ్చిందేవిలాగున్నావు..ఎంతక్కొన్నా వేటి? పట్టుచీర నాగుంది" యాదమ్మ కొలీగ్ పాపమ్మ చీర నాణ్యతను పరిశీ లిస్తూ అడిగింది. యాదమ్మ పట్టి అమాయకురాలు. అబద్ధాలు చెప్పడం,

గొప్పలకు పోవడం చేతకాదు. జరిగింది చెప్పింది.

"ఆ ... ఎంతదురుట్టవే సీది.. అచ్చంగా జరీ పట్టుకోక..ఇక కట్టవాక.. దాసుకో పెళ్ళినాడు కట్టుకుందువు" అని సలహా ఇచ్చిందది పాపమ్మ. దర్పంగా నవ్వి దర్బారు రోడ్ ఊడుస్తోంది యాదమ్మ. అప్పటికి సూరీడు బాగా పైకొచ్చాడు. పగటి ఎండలో నెమలి కంఠం పట్టుచీర 'నన్ను చూడు... నా అందం చూడ'ని మరీ మిడిసిపడి పోతోంది. చెత్తా చెదారం కసువూడ్చి రోడ్డువారగా మధ్య మధ్య కుప్పలు పోస్తోంది యాదమ్మ. వెనకే పాపమ్మ తట్టల్లో ఎత్తుకెళ్ళి మునిసిపాలిటీ ట్రాక్టర్‌లో పోస్తోంది.


అకస్మాత్తుగా పెద్ద చప్పుడుతో వెన్ను చురుక్కుమనేసరికి "ఓ లమ్మో!" అని కెవ్వుమంది యాదమ్మ. వెనగ్గా లాఠీ ఊపుతూ నుంచున్నాడు పోలీసాయన. యాదమ్మ పై ప్రాణాలు పైనే పోయాయి. యాదమ్మకి పోలీసులంటే చచ్చే భయం. అక్కడ ఎర్ర టోపీ కనిపిస్తే ఇక్కడ్నించి పరుగెడుతుంది. అట్టాటిది!

"యాడిదే.. నీకీ సీర!" గుడ్లురిమి గద్దించాడు కానిస్టేబిల్. బిక్కచచ్చి పోయింది యాదమ్మ. ఒళ్ళంతా చెమటలు కమ్మాయి. "కొనుక్కున్నానయ్యా!" అంది భయం భయంగా.

వికటంగా నవ్వాడు .. "కొనుక్కున్నావా? నాయాల్ది పట్టుసీర కొన్నావంటే నువ్వు. పద పద" ముందు లాఠీతో రెండు తగల్నిచ్చి మరీ మాట్లాడుతున్నాడు. యాదమ్మ నసలు నోరు విప్పనివ్వడం లేదు.

# అలసిన విశాలాంధ్ర

ప్రత్యేక ఆంధ్రా, తెలంగాణా వేడి గాడ్పులకు
వడగొన్న విశాలాంధ్ర రమ
బడలిక తీర్చి ఓదార్చే బిడ్డల కోసం
శాంతి వెన్నెలలు కురిపించే వేళ కోసం
వొళ్ళంతా కళ్ళు చేసుకు చూసింది
వడగాలి వడి తగ్గగానే
మళ్ళీ కొత్త బెడద తలెత్తింది
కుల రాజకీయాల కుమ్ములాట
పరస్పర హననానికి ప్రారంభం పలికింది
స్వాగత మందుకోవలసిన సంక్రాంతి లక్ష్మి
రంగవల్లులకు బదులు రక్తపు మడుగులను
గొబ్బెమ్మలకు బదులు కుప్పలుగా పడిన శవాలను
హరి కీర్తనలకు బదులు హాహాకారాలను
కని, విని కళ్ళు చెవులు మూసుకుని
పాపం! గడ గడ వణికింది!
ఎటు చూసినా విధ్వంసం,
ఎల్లలు లేని అమానుషత్వం!
కృష్ణవేణి ప్రవహిస్తున్న విషాదం!
కనకదుర్గ కన్నీరు గడ్డకట్టిన కొండపై
మూగవోయిన దేవత!
'కర్ఫ్యూ' ముళ్ళతీగె పట్టణాలనే



కాదు పల్లెని పల్లెలను కూడా చుట్టుముట్టింది!
"నెత్తురోడుతున్న నేటి పంజాబుకు
నిన్ను చెల్లాయిని చేయాలనుకొంటున్నారా?"
అని విశాలాంధ్రని మానవత
ప్రశ్నిస్తూ, విచారం ప్రకటిస్తోంది
ఆంధ్రుల కలల పంటగా
ఆవిర్భవించిన తనను
మరోసారి 'విషాదాంధ్ర'గా మార్చాలని చూసే
దురాగతాలను దుఃఖంతో
అలసటతో చూస్తోంది విశాలాంధ్ర

—కొండపల్లి కోటేశ్వరమ్మ

లాఠీ వంటిని తాకినప్పుడల్లా కెవ్వున బాధతో అరుస్తూ, "నిజవయ్యా.. ఓ మడిసి పది రూపాయిల కమ్మిండు.. నమ్మండయ్యా" అని ఏడుస్తోంది యాదమ్మ. తన్నుకుంటూ పోలీసు స్టేషన్‌కి లాక్కెళ్ళాడు.

"ఎక్కడ కొన్నావు.. ఎవరి దగ్గర కొన్నావు?"

ఎంతకు కొందో చెప్పగలదు కాని.. అమ్మినవాడెవరో చెప్పలేకపోతోంది యాదమ్మ. తెలిసి చెప్పడం లేదనీ పోలీసుల అనుమానం. ఈ మధ్య చెలరేగిన అల్లర్లలో దుకాణాలు ధ్వంసం చేశారు, లూటీ చేశారు, దోచుకున్నారు, దగ్ధం చేశారు. అల్లర్లు కాస్త సర్దుమణిగాయి. దోషుల్నీ, దుండగుల్నీ పట్టి ఇక ప్రజలు అన్యాయంగా పోగొట్టుకున్న ఆస్తులను, వస్తువులను వసూలు చేసి మళ్ళీ వారికందజేసే కార్యక్రమం చేపట్టింది ప్రభుత్వం. బావుల్లోనూ, చెరువుల్లోనూ పూడ్చిపెట్టిన వస్తువుల్ని బయటకు తీస్తున్నారు. యాదమ్మ కట్టిన చీర కొల్లగొట్టబడిన ఒక పెద్ద షోరూం దని తెలిసింది. యాదమ్మ నుంచి నిజం రాబట్టాలని ఎంతో ప్రయత్నించారు. తిట్టారు, కొట్టారు, కూడూ-నీరూ ఇవ్వ కుండా రెండ్రోజులు లాకప్‌లో పడేసి చితకబాదారు. చివరికి వంటి మీద చీర ఊడలాక్కుని బయటకు తోశారు. చిరిగిన లంగా, జాకెట్‌తో గుడిసెకొచ్చి పడింది యాదమ్మ వెక్కెక్కి పడుతూ. లాఠీ పోటులతో ఒళ్ళంతా కుళ్ళబొడిచినందుకు కాదు, కొనుక్కున్న చీర లాక్కున్నందుకూ కాదు. 'ఆడెవడో తనకు తెల్దంటే నమ్మరు. దొంగను సేసిర్రు' అని కుమిలిపోతోంది, ఉన్నంతలో నిజాయితీగా, పరువుగా బతుకీడుస్తున్న ఆడకూతురు.

*

యర్రమిల్లి విజయలక్ష్మి,
బందావారి మేట,
బందావారి వీధి,
చీరాల - 523 156.

# పాములనాట్యం

పాములు రెండే రెండు సమయాలలో నాట్యం చేస్తాయి. ఈ రెండూ జత కట్టే సమయానికి సంబంధించినవే! ఇవి జత కట్టే సమయానికి ముందు రెండు మగ పాములు నాట్యం చేస్తాయి. ఈ సమయంలో వీటి నాట్యం కలహపూరితంగా వుంటుంది. ఆడ పాముల నాకర్షించేందుకు రెండూ ఒక దానితో ఒకటి పోటీపడి నాట్యం చేస్తాయి.

రెండవ రకం నాట్యం ఆడ పాము, మగ పాము జత కట్టే ముందు రెండూ కలిసి చేసేది.

ఇవి రెండూ ఒకదాని నొకటి పెనవేసుకొని తలలను పైకి లేపుతాయి. అప్పుడవి 'U' ఆకారంలోకి వస్తాయి. ఈ విధంగా ఈ నాట్యం ఒక గంటసేపు సాగుతుంది. ఈ నాట్యం బాగా నాగు పాముల లోను, ఇతర విష సర్పాలలోను కన్పిస్తుంది.

—శశీ అవంత్

